సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 18, జూన్, 2025



ఎర్రచందనం దుంగల స్వాధీనం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు మంగళవారం భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. -8లో



ఆందోళనకు తాత్కాలిక విరామం

ఒంటిమిట్ట మండలంలోని చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1230 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	470	470
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 258.900 కిలోలు

న్యూస్‌రీల్

20న జాబ్‌మేళా

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణం రెడ్డివారి వీధిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న జాబ్‌మేళాల నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయనున్న విద్యార్థులతోపాటు 2023–2024 విద్యా సంవత్సరంలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకురావాలని వివరించారు.

19న హార్సిలీహిల్స్‌లో యోగాంధ్ర

రాయచోటి: హార్సిలీహిల్స్‌లో ఈనెల 19న యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ హార్సిలీహిల్స్‌లో వెయ్యి మందితో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పర్యాటక కేంద్రాల్లో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 19న హార్సిలీహిల్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, పీడీడీఆర్ డీఏ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారి లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న రాహుల్‌చౌదరి

సిద్దవటం: కేంద్ర ప్రభుత్వం గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ రాజస్తాన్‌కు చెందిన రాహుల్ చౌదరి పాదయాత్ర చేపట్టారు. ఆయన మంగళవారం సిద్దవటానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భరత్‌పూర్ జిల్లా జోత్రోలి గ్రామానికి చెందిన తాను తమ గ్రామం నుంచి 2024 సెప్టెంబర్ 11న పాదయాత్ర ప్రారంభించానని తెలిపారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ చేరుకున్నానన్నారు. ఇప్పటి వరకు 264 రోజుల పాటు పాదయాత్ర చేశానన్నారు. ఇంకా తమిళనాడు, జార్ఖండ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, నేపాల్ మీదుగా ఉత్తరాంచల్ వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు.

సిద్దవటంలో వైద్య సిబ్బంది పర్యటన



సిద్దవటంలో దోమల నివారణ కోసం ఇంటింటికి స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

సిద్దవటం : మండల కేంద్రం పరిధి పోలీసు లైన్ సమీపంలోని వీధిలో వైరల్ ఫీవర్ రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం మలేరియా వ్యతిరేక నివారణ వారోత్సవాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు దోమల నివారణకు ఇంటింటా స్ప్రేయింగ్ చేయించి మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లించారు. అంతేగాకుండా పాత టైర్లలో, కూలర్‌లలో నీరు నిల్వ ఉండటంతో వాటిని తొలగించి అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ మలేరియా జూలై నుంచి నవంబర్ వరకు జ్వరాలు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. పూల కుండీలు, పాత టైర్లు, డిస్‌పోజల్ గ్లాసులు, పాత డబ్బాలలో వ్యర్థాలతో కూడి మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే వాతావరణంలో మార్పుల వల్ల వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. విరేచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవడమే కాక పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో పి.కొత్తపల్లె పీహెచ్‌సీ సీహెచ్ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, మౌలాలి, ఏఎన్ఎం శారద, ఆశా వర్కర్ ఓబులమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

టమాటా.. నష్టాల మూట


- వర్షాలకు తెగుళ్లు సోకి దెబ్బతిన్న పంట
- నల్లమచ్చలు, ఊజి రోగంతో నాణ్యత లోపం
- ధర పుంజుకొంటున్నా తగ్గుతున్న దిగుబడి
- లబోదిబోమంటున్న రైతులు



టామాటకు సోకిన నల్లమచ్చల రోగం



రెడ్డివారిపల్లెలో వర్షాలకు దెబ్బతిన్న టమాటా తోట



గుర్రంకొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణం కారణంగా.. జిల్లాలోని టమాటా తోటలు దెబ్బతిన్నాయి. నల్లమచ్చలు, ఊజిరోగాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఇప్పుడిప్పుడే ధరలు పుంజు కొంటుండటంతో రైతుల ఆశలు చిగురించాయి. అయితే పంట దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవడంతో వారి ఆశలు అడియాసలుగా మారాయి.

నల్లమచ్చలు, ఊజిరోగాలతో దెబ్బతిన్న తోటలు

వరుసగా కురుస్తున్న వర్షాలు, మరోవైపు మారు తున్న వాతావరణం దెబ్బకు టమాటా తోటలకు నల్లమచ్చలు, ఊజి, గజ్జి రోగాలు ఆవహించడంతో పంట భారీగా దెబ్బతినింది. చెట్టులోని కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. కాయల సైజు పెరిగినా మచ్చలు అలాగే ఉంటున్నాయి. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ లేకపోతోంది. ఊజీ రోగాలతో ప్రస్తుతం తోటల్లో ఉన్న కాయలకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. ఊజి ఈగలు, ఆకుమడుత రోగాలు చెట్టును, ఆకుల్ని సైతం పీల్చి పిప్పిచేస్తున్నాయి.

30 శాతం మేరకు నల్లమచ్చలున్న టమాటాలే

మంచి కాపు మీదున్న టమాటా తోటలు వర్షాల ప్రభావానికి గురై 30 శాతం మేరకు కాయలు దెబ్బతిన్నాయి. వివిధ రకాల రోగాలు సోకి తోటల్లో కాయలు దెబ్బతిన్నాయి. తోటల్లో కాయల కోత సమయంలో వంద క్రేట్లకు గాను 30 క్రేట్లు నల్లమచ్చలున్న టమాటాలే ఉండటం గమనార్హం. వీటిని ప్రత్యేకంగా మామూలు టమాటాల నుంచి వేరు చేసి.. మార్కెట్‌కు తరలించాలంటే తలప్రాణం తోకకు వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో చేసేదిలేక నల్లమచ్చలున్న కాయల్ని పొలాల వద్ద రోడ్ల పక్కనే పారబోస్తున్నారు.

12350 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



ఊజీ, నల్లమచ్చల రోగాలతో టమాటాలపై ఏర్పడిన రంధ్రాలు, నల్లమచ్చలు

జిల్లా వ్యాప్తంగా 12,350 ఎకరాల్లో టమాటా పంటలు దెబ్బతిన్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోగాలు సోకిన పంటల కాయలు రూపురేఖలు మారిపోయాయి. ఓవైపు నల్లమచ్చలు, మరోవైపు రంధ్రాలున్న కాయలు ఎక్కువగా వస్తున్నాయి. వీటికి తోడు పలు చోట్ల కాయలు, పిందెలు రాలిపోయి కాలువల్లో పడిపోయాయి.

జిల్లాలో సాగు చేసిన టమాటా (విస్తీర్ణం ఎకరాల్లో)	ప్రస్తుతం వస్తున్న (స్టాకు క్వింటాళ్లలో)	నల్లమచ్చలతో దెబ్బతిన పంట	నష్టం (రూ.కోట్లలో)
28000	45000	12350	16

గిట్టుబాటు ధరలున్నా నష్టపోతున్న రైతులు

ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా ధరలు రోజురోజుకు పుంజుకొంటున్నాయి. ఒక క్రేట్(25కేజీల) ధర రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి. అయితే ఊజి రోగం ప్రభావంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఒక ఎకరానికి 240 నుంచి 280 క్రేట్ల వరకు నల్లమచ్చలున్న కాయలు వస్తున్నాయి. దీంతో ఎకరానికి రూ.1.40 లక్షల చొప్పున రైతులు నష్టపోతున్నారు. జిల్లా మొత్తం మీద రూ.16 కోట్లు నష్టపోతున్నారు. చాలా రోజుల తరువాత మార్కెట్లో టమాటాలకు గిట్టుబాటు ధరలు పలుకుతున్నాయి. అయితే టమాటా రైతులను దురదృష్టం నల్లమచ్చలు, ఊజిరోగం రూపంలో మరోసారి వెంటాడింది. దీంతో రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు.



రోడ్డు పక్కనే పారబోసిన తెగుళ్లు వ్యాపించిన కాయలు

కొనేవారులేరు



నల్లమచ్చల రోగంతో దెబ్బతిన్న టమాటాలను కొనేవారు లేరు. విధిలేక మార్కెట్‌కు తీసుకుపోతున్నా.. అక్కడ వ్యాపారులు కొనడం లేదు. చేసేదిలేక టమాటాలను తోటల్లో కోసి అక్కడే వదిలేసి వస్తున్నాం. మంచి టమాటాలు, నల్లమచ్చలున్న టమాటాలను వేరు చేసి.. దెబ్బతిన్ని వాటిని పొలాల వద్ద, రోడ్ల పక్కనే పారబోస్తున్నాం. రోగాల దెబ్బతో టమాటా పంట రోజురోజుకు దెబ్బతింటోంది.

–వెంకటాచలపతి, టమాటా రైతు, చినకంపల్లె

నష్టపోయాం



రోగాలతో బాగా నష్టపోయాం. ఎకరం టమాటా సాగు చేశాను. ఇప్పుడు కురిసిన వర్షానికి నల్లమచ్చల రోగం బాగా ఎక్కువగా ఉంది. పంట దిగుబడిలో 30 శాతం టమాటాలు రోగాలతో దెబ్బతిన్నాయి. ఒక కోతకు 30 క్రేట్ల నల్లమచ్చలు, ఊజి రోగాలతో దెబ్బతిన్న టమాటాలే వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. ఈ సమయంలో రోగాలతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నాం.

– కృష్ణమూర్తి, టమాటా రైతు, రెడ్డివారిపల్లె

బాబోయ్.. ఇదేం తల్లికి వందనం



పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద బారులు దీరిన లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వం ఎన్నో కొర్రీల తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకాన్ని.. అందుకోవడానికి ప్రజలు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. కొందరి తల్లుల బ్యాంక్ ఖాతాలకు కాకుండా.. ఆధార్‌కు అనుసంధానం అయిన పోస్టల్ ఖాతాలకు నగదు జమ అయింది. డ్రా చేసుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కడపలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం ప్రజలు బారులు తీరి కనిపించారు. ఉదయం 7 గంటల నుంచే దాదాపు కిలోమీటరు మేర బారులు తీరారు. చిన్న పిల్లలను తీసుకొచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తాగునీరు, భోజనం లేక ఆకలితో అలమటించారు. కార్యాలయం నుంచి ప్రధాన రహదారి పైకి క్యూ ఉండటంతో.. తోపులాట జరగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పోస్టల్ అధికారులు ప్రజల క్యూకు తగ్గటుగా కౌంటర్లను ఏర్పాటు చేయకుండా.. ఉన్న రెండు కౌంటర్లతోనే కార్యకలాపాలు సాగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– కడప వైఎస్ఆర్ సర్కిల్



అలసి.. సొలసి..



మహిళలకు పోస్టల్ సేవలు అందిస్తున్న సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: వైఎస్ఆర్ కడప జిల్లా అడ్మిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పని చేయుటకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు(స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21 నుంచి 30 వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఎన్‌జీవో కాలనీలోని అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్రశిక్ష కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు కడపలోని అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయం వారిని సంప్రదించాలని వివరించారు.

చక్రాలమడుగు కబ్జాపై చర్యలు తీసుకుంటాం

జిల్లా కలెక్టరు శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి, చిత్రంలో సబ్‌కలెక్టర్ వైకోమానైదియాదేవి

రాజంపేట: రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చక్రాలమడుగు కబ్జాపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కోట్లాది రూపాయలు విలువ చేసే చక్రాలమడుగు కబ్జాల పర్వంపై మీడియా అడిగిన ప్రశ్నలపై ఆయన స్పందించారు. మడుగులో ఇప్పటికే 1500 నివాసాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఒకరి దగ్గర చర్య తీసుకోవడం మొదలు పెడితే ఎంత వరకు వెళుతుందో తెలియని పరిస్థితి అన్నారు. ఉన్న ప్రాంతాన్ని కాపాడుకుంటూనే, మిగతా వాటి గురించి ఆలోచించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. చక్రాలమడుగులో ఉన్న నివాసాల వారికి ప్రత్యామ్నాయ కేటాయింపులపై ఆలోచించాలన్నారు. ఇప్పుడు నిర్మితమవుతున్న కట్టడాలపై ఫైల్ రన్ అవుతోందన్నారు. ఈ విషయంపై రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమానైదియాదేవి దృష్టి సారించారని వివరించారు. చక్రాలమడుగు కబ్జాలతో కుచించుకుపోయిందని, వరదలు సంభవిస్తే రాజంపేట పట్టణం మునిగిపోతుందని కలెక్టర్ ఎదుట స్థానికులు వాపోయారు. మడుగు కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు.

రాజంపేటలో రెవెన్యూ రికార్డులపై..

రాయచోటి తరహాలోనే రాజంపేట తహసీల్దారు కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులు బయటి వారి చేతిలో ఉన్నాయనే ఆరోపణలు మీడియా సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాయచోటి తరహాలోనే ఇక్కడ కూడా మాజీ రెవెన్యూ సిబ్బంది, రెవెన్యూ దళారుల ఇళ్లలో తనిఖీలు చేస్తే రాయచోటి తరహాలో రెవెన్యూ స్కాం వెలుగులోకి వస్తుందన్నారు. ఆధారాలు చూపిస్తే తనిఖీలు చేస్తామన్నారు. తమ వంతుగా ఆ దిశగా దృష్టి సారిస్తామన్నారు. రాయచోటిలో చోటుచేసుకున్న రికార్డులు, ఫేక్ పట్టాలు తదితర వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకుంటాం

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మామిడి రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలపై ఆయన ప్రత్యేకంగా రైల్వేకోడూరుకు వచ్చి మామిడి రైతులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. అలాగే స్థానికంగా ఉండే ఫుడ్ ప్రాడక్ట్ పరిశ్రమలను సందర్శించి అధికారులు, వ్యాపారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కాయల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాయలు నాణ్యవంతంగా పక్వానికి వచ్చిన తరువాత తరలించాలని కోరారు. ఆగస్టు చివరి వరకు మార్కెట్, ఫ్యాక్టరీలకు తరలించవచ్చని తెలిపారు. రైతులు తొందరపడి పక్వానికి రాని కాయలను తరలిస్తే నష్టపోతారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలు ఇచ్చే ధరలు కాకుండా కిలోకు నాలుగు రూపాయలను ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. అలాగే దళారీలు, వ్యాపారాలు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యాపారాలు పాల్గొన్నారు.

ఆ ఊరంతా ఖాళీ..!



ఇళ్లలో జనం లేక బోసిపోయిన గెరికుంటపల్లె



నిర్మానుష్యంగా ప్రధాన రోడ్డు

- నాయకులతోపాటు సామాన్యులు పరారీ
- జనసంచారం లేక వెలవెలబోతున్న గెరికుంటపల్లె
- ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

గుర్రంకొండ: కూటమి నేతలు పోలీసులపై దాడి చేసి, పోలీస్ జీపు అద్దాలు పగులగొట్టి విధ్వంసానికి పాల్పడిన సంఘటనలో.. గెరికుంటపల్లె ఊరంతా ఖాళీ అయింది. దాడికి పాల్పడిన నాయకులతోపాటు సామన్య ప్రజలు ఊరు విడిచి పరారీలో ఉన్నారు. జనసంచారం లేక ఊరంతా వెలవెలబోతోంది. ఈ సంఘటనపై ఎనిమిది రోజులుగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎంత మందిపై కేసు నమోదు చేశారన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లె గ్రామంలో గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించే విషయమై పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. ఈ నెల 10వ తేదీ రాత్రి తిరునాల సందర్భంగా చాందినీ బండ్ల ముందు రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించాలని కూటమి నేతలు పట్టుబట్టారు. అనుమతి లేకుండా నిర్వహించకూడదని పోలీసులు అడ్డుకొన్నారు. ఈ విషయమై నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో నాయకులు ఒక్కసారిగా పోలీసులపై మూకుమ్మడిగా దౌర్జన్యానికి దిగి దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా పోలీస్ జీపు అద్దాలు పగులగొట్టి విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. తదనంతరం పోలీసు ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

ఐదుగురి అరెస్ట్

ఎనిమిది రోజులుగా పోలీసుల దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో గ్రామంలోని కూటమి నాయకులతోపాటు సామాన్య ప్రజలు పరారయ్యారు. నాయకులతోపాటు ఎక్కడ తమను కేసుల్లో ఇరికిస్తారోనని పలువురు గ్రామం విడిచి వెళ్లిపోయారు. గ్రామంలో చిన్నపిల్లలు, మహిళలు తప్ప పురుషులు ఉండటం లేదు. ఇప్పటికే పలుమార్లు పోలీసులు ఈ కేసులో ఉన్న వారి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఆ రోజు రాత్రి పోలీసులపై ఎంత మంది దాడికి పాల్పడ్డారు. పోలీసు జీపు అద్దాలను పగులగొట్టింది ఎవరు అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే పలువుర్ని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఇంకా పలువుర్ని గుర్తించే పనిలో పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. తొందరలోనే దర్యాప్తు పూర్తి చేసి ఎంత మందిపై కేసు నమోదు చేశారో అన్న వివరాలు వెలుగు చూసే అవకాశముంది. ఈవిషయమై ఎస్ఐ రఘురామ్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందన్నారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేశామని, ఇంకా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, ఈ సంఘటనలో ఎంత మంది పాల్గొన్నారో అంత మందిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థిని మృతి

మదనపల్లె రూరల్ : ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ పాతకోటకు చెందిన జమాల్ కుమార్తె తజ్విన్ తాజ్(12) స్థానికంగా ఏడో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చిన తర్వాత ఉదయం వండిన ఆహారాన్ని తింది. తర్వాత రాత్రి తజ్విన్ తాజ్‌కు వాంతులు కావడంతో అనారోగ్యానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ఆ విద్యార్థిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి అర్ధరాత్రి సమయంలో తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో చికిత్స చేసి ఐసీయూ విభాగానికి తరలించి చికిత్స అందించారు. మంగళవారం ఉదయం పరిస్థితి విషమించి విద్యార్థిని మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించి ములకలచెరువు పోలీసులకు అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారం అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుర్తు తెలియని (30–35 ఏళ్లు) వ్యక్తి మృతి చెందాడు. ఆస్పత్రిలోని భవనాలకు వెనుక భాగాన గోడకు ఆనుకొని మృతదేహం కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి ముఖంపై గాయాలు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉంటారనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ మృతదేహంపై స్పష్టత రానందున మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి కోసం ఎవరూ రానందున అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ బీవీ చలపతి తెలిపారు.

ఆంధ్రసౌత్ జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు బాలిక


పూర్విజ

నందలూరు : ఆంధ్ర సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు విభా ఏరుడైట్ స్కూల్‌కు చెందిన హనుమంతు పూర్విజా ఎంపికైనట్లు క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫైరోజ్‌ఖాన్ లోడీలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ పూర్విజ స్థానిక సబ్‌సెంటర్లో ఫాస్ట్ బౌలింగ్‌లో శిక్షణ పొందుతూ మంచి క్రమశిక్షణతో శ్రమించి ప్రాక్టీస్ చేస్తూ జిల్లా జట్టుకు ఎంపిక అయిందన్నారు. తన ఫాస్ట్ బౌలింగ్‌తో నెల్లూరు జిల్లాలో జరిగిన జిల్లా క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో అన్ని జిల్లాల మీద మంచి వికెట్లు సాధించి అండర్ –15 విభాగంలో ఆంధ్రా సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక అయిందన్నారు.

తల్లిదండ్రుల ఆందోళనకు తాత్కాలిక విరామం

- 6,7,8 తరగతులను తిరిగి తీసుకొచ్చేందుకు మూడు నెలల గడువు
- హామీలను లిఖితపూర్వకంగా రాసిచ్చిన డీఈఓ, ఆర్డీఓ


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

ఒంటిమిట్ట : గత ఐదు రోజులుగా మండల పరిధిలోని చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు తాళాలు వేసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న విషయం విదితమే. తల్లిదండ్రుల ఆందోళనకు ప్రభుత్వం దిగివచ్చింది. కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, కడప రెవెన్యూ డివిజన్ అధికారి జాన్ ఇర్విన్ 6,7,8 తరగతులను తిరిగి తీసుకొస్తామని భరోసా ఇచ్చి, హామీ ఇవ్వడంతో చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద జరుగుతున్న తల్లిదండ్రుల ఆందోళనకు విరామం పలికారు. కాగా అంతకుముందు ఆందోళన జరుగుతున్న పాఠశాల వద్దకు చేరుకున్న కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, కడప రెవెన్యూ డివిజన్ జాన్ ఇర్విన్, పోలీసుల బందోబస్తు నడుమ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ పెద్దలతో వారి డిమాండ్లపై చర్చించారు. ఎన్నో ఏళ్లుగా చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8వ తరగతులను చెబుతుంటే నేడు ఈ కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయం 117 జీఓను తీసుకువచ్చి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న 6,7,8వ తరగతులను కిలోమీటర్ మేర దూరంలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో విలీనం చేయడం అన్యాయమని డీఈఓతో విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ పెద్దలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల సమస్యను విన్న జిల్లా విద్యాశాఖ అధికారి, కడప రెవెన్యూ డివిజన్ అధికారి మాట్లాడుతూ చిన్న కొత్తపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చింది. మీ పోరాటానికి గౌరవంగా రాష్ట్ర ప్రభుత్వం తరగతులు విలీనం చేసిన పాఠశాలలు ఉన్న ప్రాంతాలలో విద్యార్థులకు అవకాశాన్ని కల్పించిందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రత్యామ్నాయం 117 జీఓ ప్రకారం పెంచితే చిన్న కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను జడ్పీహెచ్‌ఎస్‌గా ప్రమోట్ చేస్తామని తెలిపారు. అంతేకాక మీ డిమాండ్ ప్రకారం ఈ పాఠశాలలో తొలగించిన 6,7,8వ తరగతులను మళ్లీ తెప్పించేందుకు ప్రభుత్వం రెండో విడతను తీసుకువస్తుందని, అందుకు మూడు నెలలు గడువు కావాలని డీఈఓ, ఆర్డీఓ తల్లిదండ్రులను కోరారు. అలాగే ఈ మూడు నెలలు చిన్నకొత్తపల్లి యుపీ పాఠశాలలో చదువుతున్న 6,7,8వ తరగతులు 52 మంది విద్యార్థులకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త మాధవరం జడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లేందుకు ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి రూ. 500లు ప్రయాణ భత్యం ఇస్తుందన్నారు. ఈ 52 మంది విద్యార్థులకు కొత్త మాధవరంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లేందుకు మంచి వ్యక్తిత్వం కలిగిన డ్రైవర్లతో కూడిన కండిషన్‌లో ఉండే వాహనాలను మాట్లాడి పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. ఇది విన్న విద్యార్థుల తల్లిదండ్రులు మీరు చెప్పిన భరోసా లిఖితపూర్వకంగా మాకు రాసి ఇచ్చి హామీ ఇవ్వాలని కోరారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి, కడప రెవెన్యూ డివిజన్ అధికారి ఒప్పుకొని వారు కోరిన విధంగా లిఖిత పూర్వకంగా రాసి సంతకాలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. దీంతో శాంతించిన తల్లిదండ్రులు తిరిగి మూడు నెలల తరువాత మా డిమాండ్లను నెరవేర్చకుంటే మళ్లీ ఇదే విధంగా ఆందోళనకు దిగుతామని, ఆందోళనకు తాత్కాలిక విరామాన్ని తెలిపారు. అలాగే కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ జిల్లాలో మూడు పాఠశాలలను దత్తత తీసుకున్నారని, అందులో చిన్న కొత్తపల్లి, కృష్ణంపల్లి, పాలసముద్రం ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలను అభివృద్ధి పథకంలో నడిపించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల రెవెన్యూ అధికారి దామోదర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి వెంకట సుబ్బయ్య, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మహ్మద్ రఫీ, ఒంటిమిట్ట చెరువు వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య, రెవెన్యూ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రియల్టర్ హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

- హత్యలో భార్య వనిత సూత్రధారిగా అనుమానిస్తున్న పోలీసులు
- మరో ఇద్దరు అనుమానితులు అదుపులోకి
- పలు కోణాల్లో విచారణ

మదనపల్లె రూరల్ : పట్టణంలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర హత్యకేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు తాలూకా సీఐ కళావెంకటరమణ, దర్యాప్తు బృందం హత్యకు సంబంధించి సాంకేతికత ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీ సేకరణ, బంధువులను విచారించడం చేశారు. మంగళవారం హత్యకేసుకు సంబంధించి మరో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న గంగాధర భార్య వనితను పూర్తిస్థాయిలో విచారించారు. హత్యకు గల కారణాలు, దారి తీసిన పరిస్థితులు, అనుమానితుల కాల్‌డేటాను విశ్లేషించారు. ముఖ్యంగా గంగాధర రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాల్లో ఇతరులతో జరిపిన లావాదేవీలపై క్షుణ్ణంగా విచారిస్తున్నారు. గంగాధర ఇదివరకే తండ్రి హత్యకేసులో ప్రధాన నిందితుడు కావడం ఓ వైపు, నగదు లావాదేవీలను అడ్డుపెట్టుకుని వివాహేతర సంబంధాలకు పాల్పడటం, భార్యతో అతడి వ్యవహారశైలి విచారణలో కీలకంగా మారాయి. అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకరు కొరియర్ బాయ్‌గా తెలుస్తోంది. హత్యోదంతంలో వీరి పాత్ర, మృతుడి భార్య వనితతో వీరి పరిచయాలపై ప్రత్యేకంగా విచారణ చేశారు. గంగాధర హత్య సుపారీనా, లేక వివాహేతర సంబంధం కారణంగా జరిగిందా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఫీజుల దోపిడీని అరికట్టండి

సుండుపల్లె : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు నాగేంద్రనాయక్ చౌహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ల పేరుతో దోపిడీకి గురి చేస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేసి పేద ప్రజల కడుపు కొడుతున్నారని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల పైన విచారణ చేపట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్లు ఢీ – నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ ఉదయ్, చంద్ర, సుబ్బరాయుడు

పీలేరురూరల్ : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ముడుపులవేములలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పాళెంగడ్డ హరిజనవాడకు చెందిన వై. చంద్ర (38), వై. సుబ్బరాయుడు (40), డ్రైవర్ ప్రసన్నకుమార్ (25) కారులో దేవపట్ల నుంచి చెన్నైకి బయలుదేరారు. కర్నూలుకు చెందిన ఉదయ్ (22) తోపాటు మరో ముగ్గురు చెన్నై నుంచి కర్నూలుకు ఇన్నోవా వాహనంలో సొంతూరికి బయలు దేరారు. అయితే మార్గం మధ్యలోని ముడుపులవేముల వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వై. చంద్ర, వై. సుబ్బరాయుడు, ప్రసన్నకుమార్, ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో పీలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చంద్ర, సుబ్బరాయుడు, ఉదయ్‌లను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

కలెక్టరేట్ ఏఓగా భీమలింగేశ్వరరావు



రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఏఓగా ఎం.భీమలింగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ నాగభూషణం అనారోగ్యం కారణంగా ఇటీవల సెలవుపై వెళ్లారు. పీలేరు తహసీల్దార్‌గా పని చేస్తున్న భీమలింగేశ్వరరావును బదిలీల్లో భాగంగా ఏఓగా కలెక్టర్ నియమించారు.

ఇప్పట్లలో అగ్ని ప్రమాదం


కాలిపోయిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో యుగంధర్‌రెడ్డి అనే రైతుకు చెందిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, లాడర్ పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.4లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతు తెలిపారు. వివరాలలోకి వెళితే.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు కాలిపోయి అగ్గిరవ్వలు ఎండు గడ్డిపై పడటంతో మంటలు బీడు పొలంలోకి ప్రవేశించడంతో పొలం గట్టున ఉంచిన పైపులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పొందిన రైతుకు అగ్ని ప్రమాదం వల్ల నష్టం సంభవించిందని, దీంతో తిరిగి ఆయనకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కుక్క అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్

ఇద్దరికి గాయాలు


గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గాలివీడు : ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో హేమంత్ కుమార్ నాయుడు, రామ్మోహన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హేమంత్ కుమార్ నాయుడు, రామ్మోహన్ ఇద్దరూ ద్విచక్రవాహనంపై గాలివీడుకు వస్తుండగా మార్గమధ్యంలో కుషావతి నదివద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో ఒక్కసారిగా అదుపు తప్పి కింద పడ్డారు. ఇద్దరికీ ముఖం, శరీరంపై గాయాల కారణంగా రక్తస్రావం కావడంతో వెంటనే 108 వాహనంలో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి 108 సిబ్బంది ఈఎంటీ ఖాదర్ బాషా, పైలట్ రామాంజులు ప్రథమచికిత్స చేశారు.

బావిలో పడి మహిళ మృతి

రామసముద్రం: రామసముద్రం మండలం కాప్పల్లి పంచాయతీ చెన్నారెడ్డిపల్లికి చెందిన ఆదెప్ప భార్య రెడ్డెమ్మ(55)చెంబకూరు సమీపంలోని ఓ పాడుబాడిన బావిలో మంగళవారం ఉదయం శవమై పడిఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించారు. అయితే మృతురాలికి భర్తలేడని తన అత్త వద్దనే ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా మతిస్థిమితం లేకుండా మద్యానికి అలవాటుపడినట్లు తెలిపారు. అయితే బావిలో శవమై కనిపించడంతో పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇది హత్యా..? ఆత్మహత్యా..? అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ వీఆర్‌ఓ కొడుకుపై ఫిర్యాదు

రాయచోటి: రాయచోటి రూరల్ మండలం, సిబ్యాల గ్రామం మాజీ వీఆర్‌ఓ నాగరాజు కుమారుడు ఫణీంద్రపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్ నరసింహ కుమార్ తెలిపారు. నకిలీ రెవెన్యూ రికార్డుల తయారీతోపాటు ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన పలు రికార్డులు, ఇంటిలో నిల్వ ఉంచుకోవడంపై ఫణీంద్రపై ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్‌కు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులతో కలిసి ఫణీంద్ర ఇంటిపై దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా నకిలీ డికెటీ పట్టాలు, పాస్ పుస్తకాల తయారీ, ఇళ్ల పట్టాలు తయారు చేయడం, వాటికి సంబంధించిన రికార్డులు, సీళ్లను గుర్తించినట్లు తెలిపారు. లభించిన ఆధారాల మేరకు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్ వివరించారు.

మట్కా బీటర్లు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని అలంకార్ సినిమా హాలు వద్ద 5 మంది మట్కా బీటర్లను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి మట్కా పట్టీలు, రూ. 1,39,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ హైమావతి మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అలంకార్ సినిమా హాల్ వద్ద మట్కా బీటర్లు ఉన్నట్లు ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో షేక్ గౌస్ ఖలందర్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 1,39,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధికి చెందిన బాణ చిన్న నారాయణరెడ్డి (75) అనే వృద్ధుడు కనిపించడం లేదని కుటుంబీకులు మంగళవారం పట్టణ ఎస్‌ఐ హైమావతికి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన బాణ చిన్న నారాయణరెడ్డి రోజు మాదిరిగా బయటకు వెళ్లి తిరిగి వచ్చేవాడు. కాగా సోమవారం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు


వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి జానం రాధ యాదవ్

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో రౌడీ రాజ్యమేలుతోందని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి జానం రాధ యాదవ్ ఆరోపించారు. మంగళవారం రాయచోటి వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమవారం సీఎం చంద్రబాబు నియోజక వర్గం కుప్పంలోని నారాయణ పురంలో మునికన్నప్ప అనే వ్యక్తి ..అప్పు చెల్లించలేదనే కారణంతో ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టారన్నారు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా విడిచిపెట్టకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రౌడీ రాజ్యం నడిపారని ఆరోపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో మహిళలు, యువతులు, బాలికలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇలాంటి సంఘటన జరిగితే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదని విమర్శించారు. ఇలాంటి సంఘటనపై హోంమంత్రి వీడియో కాల్ ద్వారా పరామర్శించడం సిగ్గుచేటన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు.

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య


అహల్య మృతదేహం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. కాప్పల్లె చెందిన సంతోష్ కు ఏడు సంవత్సరాల క్రితం కర్ణాటక కు చెందిన అహల్య (27) తో వివాహం జరిగింది. వీరికి రోహన్ సాయి, రుషి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతోష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా అహల్య వేరు కాపురం పెట్టాలని భర్తతో తరచూ గొడవపడుతుండేది. మంగళవారం ఇదే విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన అహల్య ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించి, రామసముద్రం పోలీసులకు సమాచారం అందించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఫారెస్టు అధికారుల అదుపులో తమిళ కూలీలు


స్వాధీనం చేసుకున్న స్కూటర్, ఎర్రచందనంతో అటవీ అధికారులు

వీరబల్లి : మండలంలోని గడికోట ప్రాంతంలో సోమవారం సాయంత్రం చమురు డోన ప్రదేశంలో ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వైసీ రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి పరిశీలించగా దుంగలు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏడు మంది ఎర్రచందనం కూలీలు ఉన్నారని.. కూలీలను అరెస్టు చేసినట్లు తెలిపారు. రూ. 50 వేలు విలువచేసే దుంగలను, నాలుగు గొడ్డళ్లను, ఒక రంపాన్ని, త్రాసు, మారుతీ సుజికి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజర్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ రజినీ, ఎఫ్‌బీఓ అనిల్ కుమార్, లీలా శ్రీహరి, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : స్కూటర్‌తో సహా రూ. 2.5 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌ఓ ఎం. గురుప్రభాకర్ తెలిపారు. డీఎఫ్‌ఓ కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సోమల మండలం కందూరు శివారు ప్రాంతం వద్ద అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున కలికిరి వైపు ఓ స్కూటర్ వేగంగా రావడం గమనించి ఆపే ప్రయత్నం చేశారు. అయితే దుండగులు కొంత దూరం ముందుకెళ్లి స్కూటర్‌ను వదిలి పారిపోయారు. స్కూటర్‌ను పరిశీలించగా రెండు బ్యాగుల్లో 92 కేజీల బరువుగల ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. స్కూటర్, ఎర్రచందనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ దాడిలో చంద్రశేఖర్, ప్రకాష్, ప్రతాప్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడిన నిందితుల అరెస్టు


పట్టుబడిన నిందితులతో అటవీ సిబ్బంది

ములకలచెరువు : అడవి పందులను వేటాడే ఇద్దరిని అటవీ శాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మదనపల్లి ఎఫ్‌ఆర్వో జయప్రసాద్‌రావ్, ములకలచెరువు సెక్షన్ ఆఫీసర్ ముబీన్‌తాజ్‌లు తెలిపిన వివరాల మేరకు...మండల పరిధిలోని బురకాయలకోట, వేపూరికోట, నేరేడికొండ ప్రాంతాల్లో వన్య ప్రాణులను వేటాడి, మాంసం తరలిస్తున్నట్లు ముందస్తుగా సమాచారం అందిందన్నారు. అనంతరం అటవీ సిబ్బంది మండల పరిధిలోని ఒడ్డిపల్లి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో తనిఖీలు చేపట్టగా సత్యసాయి జిల్లా కదిరి వీరాస్ కాలనీకి చెందిన బాలాజీ (23), మండలంలోని రామాపురానికి చెందిన మంజునాథ్ (30)లు మాంసం, మారణాయుధాలతో పట్టు బడ్డారన్నారు. నిందితులకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

డైట్ మ్యాగజైన్‌కు రచనల ఆహ్వానం


మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ బాబు

రాయచోటి టౌన్ : డైట్ విద్యా శిక్షణ సంస్థ వెలువరించే నెలవారీ పత్రికలో ప్రచురణ కోసం రచనలను ఆహ్వానిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు తెలిపారు. మంగళవారం డైట్ కళాశాల ఆవరణలో నిర్వహించిన అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా విషయక విజ్ఞాన అంశాలతో పత్రిక ఉండాలన్నారు. పాఠశాలలో అమలు చేసే వినూత్న పద్ధతులు సృజనాత్మక బోధన విధానాలు పత్రిక ద్వారా తెలియజేవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు, పంపవచ్చని పత్రిక ఎడిటర్, సీనియర్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వరావు, సుబ్బారెడ్డి, కేధార్నాథ్, రెడ్డెయ్య పాల్గొన్నారు.

మలుగుడుపాడులో భూఆక్రమణల జోరు


డీ పట్టాలు పొందిన భూములలో దోజర్‌తో చదును చేస్తున్న దృశ్యం


ఆక్రమణదారులు వేసిన వ్యవసాయ బోరు

- అధికార పార్టీ అండతో నిరుపేదలకు ఇచ్చిన భూముల ఆక్రమణ
- దివంగత వైఎస్సార్ ప్రభుత్వంలో నిరుపేదలకు పట్టాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు పంచాయతీ మలుగుడు పాడు గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 571లో వందలాది ఎకరాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇందులో అధికార టీడీపీకి చెందిన స్థానిక పంచాయతీ నాయకులు ముందు ఉండి ఆక్రమణలకు శ్రీకారం చుడుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2005లో అసైన్‌మెంట్ కమిటీకి ఉత్తర్వులు ఇవ్వడంతో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ డీఎల్ రవీంద్రారెడ్డి డి.నేలటూరు పంచాయతీలో ఉన్న బీసీ, ఎస్సీ, ఓసీ నిరుపేదలకు ఒక్కొక్కరికి 3 నుంచి 5 ఎకరాల వరకు భూ పంపిణీ చేశారు. డీ పట్టాలు కూడా పొందారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డి.నేలటూరు పంచాయతీ పరిధిలో ఉన్న అధికార పార్టీ నాయకులు నిరుపేదలకు ఇచ్చిన భూములపై పడ్డారు. నాయకులు వాటాలుగా పంచుకొని రాత్రి వేళల్లో బోర్లు వేయడం.. డోజర్లతో చదును చేయడం ప్రారంభించారు. డీ పట్టాలు ఉన్న బీసీలు, ఎస్సీలు అడ్డుకొనేందుకు వెళ్లినా నీ భూమి ఇక్కడ లేదు ఎక్కడో ఉంది అక్కడికి వెళ్లు.. అని భయానికి గురి చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. వందలాది ఎకరాలు ఆక్రమణలకు గురి అవుతున్నా రెవిన్యూ అధికారులు మాత్రం అటువైపు చూడనట్లు ఉన్నారు.

కాగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాత్రం ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు చెప్పానని అంటున్నారు. మరి ఆయన మాటలు వారు విననట్లు ఉంది. పేదల భూములు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా చర్యలు మాత్రం శూన్యం.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.